నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
11-07-2025
పేజీలు: 02



## గోల్కొండ కోటలో అమ్మకు 5వ బోనం

శివసత్తులు, పోతరాజు నృత్యాలు, తొట్టెల ఉరేగింపుతో తెలంగాణలో బోనాలు ఘనంగా జరుపుకుంటున్నారు. గురువారం అషాఢమాసం సందర్భంగా గోల్కొండ కోటలోని శ్రీజగదాంబిక ఎల్లమ్మ అమ్మవారికి 5వ బోనం సమర్పించారు. ఆలయ చైర్మన్ చంటిబాబు, కమిటీ సభ్యుల అధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. జస్టిస్ బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జస్టిస్ బి.ఎస్.జగజ్జీవన్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. వేల సంఖ్యలో భక్తులు కోటకు చేరుకొని అమ్మవారిని దర్శించుకొని బోనాలను, తొట్టెలను సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జలమండలి అధికారులు మంచినీటి వసతిని ఏర్పాటు చేయగా, కోటు చుట్టూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బోనాల ఉత్సవాల్లో ఈవో చిదెళ్ల వసంత, ఆలయ పూజారి సర్వేశ్, ఆకుల చంద్రశేఖర్, జి. సంతోష్‌గౌడ్, జలమండలి అధికారులు రాజేశ్, రమేశ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

# 75 ఏళ్లకే రిటైర్ కావాలి

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేతలు 75 ఏళ్లకు రిటైర్ అవ్వాలని పేర్కొన్నారు. 'మీకు 75 ఏళ్లు వస్తే.. ఇక ఆగిపోయి ఇతరులకు అవకాశం ఇవ్వాలి' అని వ్యాఖ్యానించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఓ పుస్తకావిష్కరణలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారంటూ తీవ్రంగా చర్చ నడుస్తోంది. నాగ్‌పూర్‌లో దివంగత ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లేకి అంకితం చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మోహన్ భగవత్ ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో మోరోపంత్ పింగ్లే మాటలను గుర్తు చేసుకున్నారు. '75 ఏళ్లు నిండిన తర్వాత మీకు శాలువాతో సత్కారం లభిస్తే దాని అర్థం మీరు ఇక ఆగిపోవాలని. పక్కకు తప్పుకుని ఇతరులకు అవకాశం ఇవ్వాలి' అంటూ గతంలో ఓ సారి మోరోపంత్ పింగ్లే చేసిన వ్యాఖ్యలను మోహన్ భగవత్ ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి.ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రధాని మోదీకి 75 ఏళ్లు పూర్తి కానున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీని ఉద్దేశించే మోహన్ భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలు మాట్లాడుకుంటున్నారు. మోహన్ భగవత్ వ్యాఖ్యలపై శివసేన (యుబిటి) ఎంపీ సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. 'ఎల్‌కే అడ్వాణీ, మురళీ మనోహర్ జోషీ, జస్వంత్ సింగ్ వంటి నాయకులను 75 ఏళ్లు దాటిన తర్వాత పదవీ విరమణ చేయమని ప్రధాని మోదీ బలవంతం చేశారు. ఇప్పుడు ఆయనకూ అదే నిబంధనను వర్తింపజేస్తారో లేదో చూడాలి' అంటూ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.

భగవత్-మోదీ.. ఇద్దరికీ 75 ఏళ్లు

అయితే, ఇదే రోజు జరిగిన మరో కార్యక్రమంలో అమిత్ షా తన భవిష్యత్తు ప్రణాళికల గురించి ప్రస్తావించారు. "నేను పదవీ విరమణ అనంతరం నా సమయాన్ని వేదాలు, ఉపనిషత్తులు చదవడానికీ, సేంద్రీయ వ్యవసాయం అభ్యసించడానికీ కేటాయించాలనుకుంటున్నాను" అని చెప్పారు. అయితే షా ఇప్పటికే 60వ ఏటకు చేరుకున్నారు. కానీ పదవికి ఎప్పుడు గుడ్‌బై చెప్పాలనుకుంటున్నారో మాత్రం ఖచ్చితంగా తెలియజేయలేదు. భగవత్ వ్యాఖ్యల సమయం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మోహన్ భగవత్, మోదీ ఇద్దరూ సెప్టెంబర్ 1950లో జన్మించారని వాస్తవం. భగవత్ సెప్టెంబర్ 11న, మోదీ సెప్టెంబర్ 17న పుట్టారు. దీంతో భగవత్ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం లభించింది.

ఆరెస్సెస్, బీజేపీ మధ్య అంతర్గత చర్చ?

"2024 ఎన్నికల కంటే ముందు నుంచే ఆరెస్సెస్, బీజేపీ మధ్య అధికారాన్ని పంచుకునే అంశం చర్చలలో ఉంది. పార్టీ అధ్యక్షుడు ఎంపికలో కూడా ఇది కీలక అంశమవుతుంది" అని బీజేపీకి చెందిన ఒక ప్రముఖ నాయకుడు అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు నిజంగా మోరోపంత్ పింగ్లే పట్ల ఇచ్చిన గౌరవ నివాళిగానేనా? లేక ఆరెస్సెస్ పునర్నిర్మాణ ఆలోచనల మొదటి అడుగులా? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం వేచి చూడాల్సిందే. కానీ తాజా రాజకీయ వర్గాల్లో ఇది ఉత్కంఠకు, ఊహాగానాలకు బలమైన మౌలికంగా నిలిచింది.

## సబలెంకాకు షాక్



ప్రతిష్ఠాత్మకమైన వింబుల్డన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో గురువారం పెను సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ అరినా సబలెంక (బెలారస్) సెమీ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. ఉత్కంఠభరితంగా సాగిన తొలి సెమీ ఫైనల్లో అమెరికాకు చెందిన యువ సంచలనం, 13వ సీడ్ అమందా అనిసిమోవా 64, 46, 64 తేడాతో సబలెంకను మట్టికరిపించింది. అసాధారణ ఆటతో అలరించిన అమందా చిరస్మరణీయ విజయంతో కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫైనల్‌కు చేరుకుంది. ఆరంభం నుంచే అమందా దూకుడైన ఆటను కనబరిచింది. టాప్ సీడ్ సబలెంకపై ఆధిపత్యం చెలాయిస్తూ ముందుకు సాగింది. తన మార్క్ షాట్లతో అరినాపై పట్టు సాధించింది. సబలెంక కూడా తన మార్క్ ఆటతో ముందుకు సాగింది. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డి పోరాడారు. దీంతో పోరులో ఉత్కంఠ తప్పలేదు. కానీ చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన అనిసిమోవా తొలి సెట్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో సెట్‌లో కూడా పోరు నువ్వానేనా అన్నట్టుగానే సాగింది. ఇద్దరు హోరాహోరీగా తలపడ్డారు. అయితే తొలి సెట్‌లో చేసిన పొరపాట్లకు తావులేకుండా ఈసారి సబలెంక చివరి వరకు నిలకడైన ఆటను కనబరిచింది.



## పాకిస్థాన్‌లో 9 మంది కాల్చివేత

పాకిస్థాన్‌లోని పంజాబ్‌కు చెందిన 9 మంది బస్సు ప్రయాణికుల్ని మిలిటెంట్లు కాల్చి చంపారు. బలోచిస్తాన్ ప్రావిన్సులోని ఓ బస్సు నుంచి వాళ్లను కిందకు దించి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఆ ప్రావిన్సులోని జోబ్ ఏరియాలో ఉన్న జాతీయ హైవేపై ప్రమాదం జరిగింది. ప్యాసింజెర్ల ఐడీ కార్డులను చెక్ చేసి మరీ ప్రయాణికులను బస్సు నుంచి దించారు. క్వెట్టా నుంచి లాహోర్ వెళ్తున్న 9 మందిని కాల్చేశారు. ప్రాణాలు కోల్పోయిన 9 మంది ప్రయాణికులు పంజాబ్ ప్రావిన్సుకు చెందినవారే. మృతదేహాలను పోస్టు మార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి పంపారు. బలోచిస్తాన్‌లో తిరుగుతున్న వివిధ ప్రావిన్సులకు చెందిన బస్సు ప్రయాణికులపై తిరుగుబాటుదారులు దాడులకు దిగుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఏ గ్రూపు కూడా ప్రకటన చేయలేదు.

## 'లక్కీ భాస్కర్' కోసం పూజా




టాలీవుడ్‌లో కొన్నాళ్ల పాటుగా తన హవా చూపించిన స్టార్ హీరోయిన్స్ లో బుట్టబొమ్మ పూజా హెగ్డే కూడా ఒకరు. మరి పూజా హెగ్డే హీరోయిన్ గా తెలుగులో మంచి సక్సెస్ లు కొట్టిన తర్వాత పూజా హెగ్డేకి వరుసగా ప్లాప్ లు పడ్డాక మాత్రం తన ప్రెజెన్స్ తెలుగు సినిమా దగ్గర తగ్గిపోయింది. ఇలా కొన్నాళ్ల పాటు పూజా హెగ్డే ప్రెజెన్స్ మిస్ అయ్యాక మళ్ళీ తమిళ్ వరుస అవకాశాలు పూజాని వరించాయి. రీసెంట్ గానే మరో క్రేజీ ఆఫర్ కూడా అందుకుంది అని కూడా వినిపించిన వార్తలు తర్వాత మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ ఇపుడు బయటకి వచ్చింది. దీనితో పూజా హెగ్డే ఇపుడు లక్కీ భాస్కర్ సల్మాన్ సరసన నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలుస్తుంది.

## పెరిగిన బంగారం, వెండి ధరలు

కొద్దిరోజులుగా స్వల్పంగా తగ్గుతూ వచ్చిన పసిడి ధరలు శుక్రవారం పెరిగాయి. హైదరాబాద్ నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,200 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,400 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 73,800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,410 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,210 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 73,810 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.





## 20 రోజుల్లో రానున్న కింగ్డమ్

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ 'కింగ్డమ్' అనే చిత్రంతో ప్రేక్షకులని అలరించటానికి సిద్ధంగా ఉన్నారు. జులై 31, 2025న విడుదల కానున్న ఈ పాన్-ఇండియన్ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుండి ఒక చిత్రాన్ని పోస్ట్ చేసి 20 రోజులలో థియేటర్స్ లో సందడి చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కథ కూడా గౌతమ్ రాసుకున్నారు. ఈ చిత్రంలో భగ్యాశ్రీ బోర్స్ మహిళా ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ చిత్రంలో నవ్య స్వామి, సత్య దేవ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. ఈ చిత్రంలో విజయ్ స్పై ఏజెంట్‌గా కనిపించనున్నారు.

## బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు తెలంగాణ కేబినెట్ ఆమోదం

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రంలో కులగణన ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్‌లకు ప్రైవేట్ యూనివర్సిటీ హోదా కల్పిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందని పొంగులేటి వివరించారు. ఈ వర్సిటీలలో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని అన్నారు. 17 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ సిద్ధంగా ఉందని, మార్చి నాటికి లక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ఇప్పటివరకు 19 కేబినెట్ సమావేశాలు నిర్వహించి, 321 అంశాలకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# ఓటీటీలోకి వచ్చేసిన టోవినో థామస్ 'నరివెట్ట'

టోవినో థామస్ నటించిన మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'నరివెట్ట' ఓటీటీలోకి వచ్చేసింది. ఈ సినిమా సోనీ లివ్ ప్లాట్‌ఫామ్‌లో జులై 10, 2025 నుంచే స్ట్రీమింగ్ అవుతోంది. వాస్తవానికి ఇది జులై 11, 2025న విడుదల కావాల్సి ఉండగా, ఒక రోజు ముందుగానే ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం మలయాళంతో పాటు, తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది.ఈ సినిమా కథ 2003లో కేరళలో జరిగిన ఆది వాసీలపై పోలీసుల ఊచకోత ముతంగ సంఘటన ఆధారంగా తెరకెక్కింది. ఇది ఆదివాసీల హక్కులు, భూమి వివాదాలు, పోలీసుల మధ్య ఘర్షణల నేపథ్యంలో నడుస్తుంది. ఇందులో టొవినో థామస్ పోలీసు కానిస్టేబుల్‌గా నటించగా.. సూరజ్ వెంజరమూడు, చేరన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనురాజ్ మనోహర్ దర్శకత్వం వహించారు.



# ఓటిటిలో స్ట్రీమింగ్‌కి వచ్చేసిన '8 వసంతాలు'

రీసెంట్ గా మన టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నుంచి రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో బ్యూటిఫుల్ చిత్రం 8 వసంతాలు కూడా ఒకటి. మొదటి నుంచి కూడా కొంచెం ప్రత్యేకంగా తీసుకున్న ఈ సినిమాని దర్శకుడు ఫణి నర్సెట్టి దర్శకత్వం వహించగా అనంతిక ప్రధాన పాత్రలో నటించింది. అయితే విడుదలకి ముందు తర్వాత కూడా కొన్ని కాంట్రవర్సీలు ఎదుర్కొన్న ఈ సినిమా ఫైనల్ గా ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ సినిమా ఓటిటి హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా ఇందులో నేటి నుంచి సినిమా అందుబాటులోకి వచ్చేసింది. ఇక ఈ చిత్రాన్ని నెట్ ఫ్లిక్స్ తెలుగు సహా ఇతర సౌత్ భాషల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. మరి అప్పుడు మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునేవారు నెట్ ఫ్లిక్స్ లో చూడొచ్చు.

# టెలిగ్రామ్ వల్ల నేను మోసపోయినట్టు ఎవరూ మోసపోకండి



టెలిగ్రామ్ వల్ల నేను మోసపోయినట్టు ఎవరూ మోసపోకండి. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి, సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్న యువతి . వర్క్ ఫ్రమ్ హోమ్ జాబ్ ఇప్పిస్తామని టెలిగ్రామ్ లో మెసేజ్ చేసి యువతి వద్ద లక్ష రూపాయలు వసూలు చేసిన సైబర్ నేరగాళ్లు. పశ్చిమ గోదావరి జిల్లా కంచుస్తంభం పాలెం గ్రామానికి చెందిన అనూష అనే యువతికి వెంకన్న బాబు అనే వ్యక్తితో ఐదేళ్ల క్రితం వివాహం జరగగా, హైదరాబాద్ కేపీహెచ్‌బీలో నివాసం ఉంటున్న దంపతులు . ఇటీవల టెలిగ్రామ్ లో వర్క్ ఫ్రమ్ హోమ్ జాబ్ ఇప్పిస్తామని మెసేజ్ రావడంతో రూ.1000 చెల్లించిన అనూష . రూ.1000 చెల్లిస్తే రూ.7000 లాభం వచ్చిందని మెసేజ్ రావడంతో, తనకు వచ్చిన లాభాన్ని తన బ్యాంకు ఖాతాలో జమ చేయమని సైబర్ నేరగాళ్లని కోరిన అనూష. మీ లాభాన్ని పొందాలంటే మరింత డబ్బు జమ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి, విడతల వారిగా తన బంగారాన్ని అమ్మి రూ.1 లక్ష వరకు చెల్లించిన అనూష . ఎన్ని సార్లు ప్రయత్నించిన వారి నుండి స్పందన లేకపోవడంతో, మోసపోయానని గ్రహించి తీవ్ర ఆందోళనకు గురైన అనూష. డబ్బులు పోయాయని బాధలో, తన లాగా ఇంకొకరు టెలిగ్రామ్ యాప్ వల్ల మోసపోకూడదని సూసైడ్ లెటర్ రాసి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న అనూష . అనూష భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

# కార్తీ 'మార్షల్' ఆరంభం

'సత్యం సుందరం'తో అలరించిన హీరో కార్తీ ఇప్పుడు విమర్శకుల ప్రశంసలు పొందిన తానక్కారన్ ఫేం డైరెక్టర్ తమిజ్ తో కలిసి తన 29వ చిత్రం కోసం చేతులు కలిపారు. ఈ ప్రాజెక్టును డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రకాష్ బాబు , ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. కార్తీని ఇంటెన్స్‌గా చూపించిన అద్భుతమైన పోస్టర్ తో మేకర్స్ గురువారం 'మార్షల్' అనే టైటిల్ ను రిలీజ్ చేశారు. శుభ పూజా కార్యక్రమంతో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ కథానాయికగా నటిస్తోంది. సత్యరాజ్, ప్రభు, లాల్, జాన్ కొక్కెన్, ఈశ్వరి రావు, మురళీ శర్మ ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మార్షల్‌ను అత్యున్నత స్థాయి సాంకేతిక, నిర్మాణ విలువలతో భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు.



# వంతెన కూలిన ఘటన.. 17మంది మృతి, నలుగురు ఇంజనీర్లు సస్పెండ్

గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై గంభీర వంతెన కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య 17కి పెరిగింది. మరో ముగ్గురు వ్యక్తుల కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పద్రా పట్టణానికి సమీపంలోని గంభీర గ్రామం వద్ద ఈ సంఘటన జరిగింది. ఆనంద్, వడోదర జిల్లాలను కలిపే నాలుగు దశాబ్దాల నాటి వంతెనలోని ఒక భాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పలు వాహనాలు నదిలో పడిపోయాయి. వడోదర కలెక్టర్ అనిల్ ధమేలియా మాట్లాడుతూ.. "NDRF, SDRF, ఇతర ఏజెన్సీల నుండి 10 బృందాలు సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నాయి. ట్రక్కుతో సహా పలు వాహనాలు నది గర్భ బురదలో చిక్కుకున్నాయి. దీంతో వాహనాలను బయటకు తీసుకొచ్చేందుకు కష్టంగా మారింది. ఇప్పటివరకు 17 మంది బాధితుల మృతదేహాలను వెలికితీశారు. మరో ఐదుగురు గాయపడిన వ్యక్తులు ప్రస్తుతం కోలుకుంటున్నారు. త్వరలో ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అవుతారు'' అని చెప్పారు.

నలుగురు ఇంజనీర్ల సస్పెన్షన్

వంతెన కూలిపోయిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాల విభాగానికి చెందిన నలుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేయబడిన వారిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ఎమ్ నాయకవాలా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యుసి పటేల్, ఆర్టి పటేల్, అసిస్టెంట్ ఇంజనీర్ జెవి షా ఉన్నారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వంతెనలను వెంటనే తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# 25 ఏళ్ల టెన్నిస్ ప్లేయర్‌ను గన్‌తో కాల్చి చంపిన తండ్రి

మహిళా టెన్నిస్ ప్లేయర్‌ను స్వయానా తండ్రే గన్‌తో కాల్చి చంపిన ఘటన హర్యానా రాష్ట్రం గుర్‌గావ్‌లో చోటు చేసుకుంది. రాధికా యాదవ్(25) అనే యువతిని, సెక్టార్ 57 లోని తమ ఇంట్లో గన్‌తో కాల్చి చంపాడు తండ్రి. 5 రౌండ్ల కాల్పులు జరపగా, మూడు బుల్లెట్లు తగిలి తీవ్రంగా గాయపడిన రాధిక యాదవ్ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులునిర్ధారించారు. ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్‌లో 113వ స్థానంలో కొనసాగుతోంది మృతురాలు రాధికా యాదవ్. రాధిక తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.కూతురు సంపాదన మీద బతుకుతున్నావా ? అది ఓ బతుకేనా ఇలాంటి సూటిపోటి మాటలు తండ్రిలోని రాక్షసత్వాన్ని నిద్ర లేపాయి. ఏకంగా కూతురు ప్రాణాలు తీసేలా చేశాయి. హర్యానాలోని గురుగ్రామ్‌లో టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ దారుణ హత్యకు గురైన వార్త సర్వత్రా సంచలనం సృష్టిస్తోంది. తమ నివాసంలోనే ఆమె తండ్రి దీపక్ యాదవ్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. రాధికా యాదవ్ రాష్ట్ర స్థాయి క్రీడాకారిణిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. కానీ, కొద్ది కాలం క్రితం జరిగిన టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న రాధికా యాదవ్‌కు తీవ్ర గాయం కావడంతో ఆటకు దూరం కావాల్సి వచ్చింది. కొంతకాలం టెన్నీస్‌కు దూరం కావడంతో మానసికంగా కృంగి పోయింది. అయితే తనలాగా టెన్నీస్‌లో రాణించాలనుకునే వారిని ప్రోత్సహించేందుకు టెన్నీస్ అకాడమనీ ప్రారంభించింది. అనతికాలంలో తన కోచింగ్‌తో రాధికా యాదవ్ పేరు ప్రఖ్యాతలు సంపాదించింది. తండ్రికి కూడా చేదోడు వాదోడుగా నిలిచింది. అయితే దీపక్ యాదవ్ కుటుంబానికి పేరు, ప్రతిష్టలు రావడం ఇష్టం లేని ఇరుగు పొరుగు వారు సూటిపోటి మాటలు అనడం ప్రారంభించారు.

# బలవంతంగా తీసుకెళ్తుండగా తుంగభద్ర కాలువలో దూకిన ప్రేమజంట

ప్రేమజంట తుంగభద్ర ఎడమ కాలువలో దూకి గల్లంతయ్యారు. ఈ సంఘటన కర్నాటక రాష్ట్రం మునిరాబాద్ డ్యామ్ చైన్ 28 వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం_ _ _ నింగాపుర గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే యువకుడు, సణాపుర గ్రామానికి చెందిన అంజలి అనే యువతి గాఢంగా ప్రేమించుకున్నారు. అంజలి కుటుంబ సభ్యులు ప్రేమ పెళ్లికి అడ్డుచెప్పారు. ఈ ప్రేమజంట పారిపోయి హగరిబొమ్మనహళ్లిలోని బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. యువతి కుటుంబ సభ్యులు తెలుసుకొని హగరిబొమ్మనహళ్లికి వెళ్లారు. ఇద్దరిని కారులో తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. అందరు కారులో వస్తుండగా మునిరాబాద్ డ్యామ్ వద్ద వాహనం ఆపి మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రేమ జంట డ్యామ్ పైనుంచి తుంగభద్ర ఎడమకాలువలో దూకారు. యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు మునిరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# బీజేపీ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌కు ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎస్. మాధవ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో కూడిన పటాన్ని బహుమతిగా ఇవ్వడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని, ప్రజల పోరాటాన్ని అవమానించడమేనని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ప్రధాని మోదీని ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడి చర్య తెలంగాణ ప్రజలను, రాష్ట్రాన్ని, చరిత్రను అవమానించే విధంగా ఉందని కేటీఆర్ అభివర్ణించారు. "మా సాంస్కృతిక గుర్తింపు, చారిత్రక స్థానం, భౌగోళిక ఉనికి కోసం తరతరాలుగా పోరాడి తెలంగాణను సాధించుకున్నాం. అలాంటిది మీ ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ అస్తిత్వాన్ని విస్మరించి 'అఖండ ఆంధ్రప్రదేశ్' పటాన్ని బహూకరించడం మా పోరాటాన్ని కించపరచడమే" అని కేటీఆర్ పేర్కొన్నారు.ఈ చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, తెలంగాణ ప్రజల పట్ల బీజేపీకి ఉన్న నిర్లక్ష్య వైఖరిని ఇది స్పష్టం చేస్తోందని ఆయన అన్నారు. "మా చరిత్రను చెరిపేస్తే మాకు అస్తిత్వం ఎక్కడ ఉంటుంది అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి ఆయన సూటి ప్రశ్నలు సంధించారు. ఇది మీ పార్టీ రాజకీయ ప్రణాళికలో భాగమా లేక అజెండానా అని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇది పొరపాటున జరిగిన తప్పిదమైతే బీజేపీ నాయకత్వం తెలంగాణ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# త్రిప్తి డిమ్రి హాట్ లుక్స్

సందీప్ రెడ్డి వంగా స్పిరిట్‌లో హీరోయిన్‌గా ఛాన్స్ దక్కించుకున్నారు త్రిప్తి దిమ్రి. అదృష్టం అంటే ఇదేనంటూ, గతంలో ఆమె ఈ ప్రాజెక్టు గురించి చెప్పిన విషయాలను గుర్తుచేసుకుంటున్నారు నెటిజన్లు.యానిమల్ ప్రమోషన్లలో ఉన్న త్రిప్తికి... సందీప్‌రెడ్డి వంగా నెక్స్ట్ ప్రాజెక్ట్ స్పిరిట్‌లో మీరున్నారట కదా అనే క్వశ్చన్ ఎదురైంది. అంత పెద్ద ప్రాజెక్టులో ఉండాలనుకోవడం అత్యాశే అవుతుంది. అయినా బ్యాక్ టు బ్యాక్ నాకు సందీప్ అవకాశాలు ఎందుకిస్తారు? అసలుఉ ఇస్తారా? అని ఎదురుప్రశ్నించారు త్రిప్తి. ఇప్పుడు ఈ విషయాన్నే రీకాల్ చేసుకుంటున్నారు నెటిజన్లు. ఆమె ఊహల్లో కూడా లేని విషయం నిజమైంది.కలిసొచ్చే కాలం అంటే ఇదేనంటూ మాట్లాడుకుంటు న్నారు. అంతే కాదు, త్రిప్తికి నచ్చిన హీరోయిన్ గురించి కూడా డిస్కషన్ మొదలుపెట్టేశారు. తనకు దీపిక అంటే చాలా ఇష్టమని ఇంతకు ముందు చెప్పారు త్రిప్తి.దీపిక సినిమాలు చూసి, చేయించుకునేదాన్ననీ అన్నారు. ఆ మాటలన్నీ వైరల్ అవుతున్నాయి. సంకల్పం, స్వయంకృషితో త్రిప్తి చాలా ఎదిగారంటూ ప్రశంసిస్తున్నారు. స్పిరిట్‌లో ప్రభాస్ పక్కన దీపిక చేయాల్సిన రోల్‌లో త్రిప్తి నటిస్తున్న విషయం తెలిసిందే.

